సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి



సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేస్తే మెడికల్ రంగంలో సేవలు అందించే ఉద్యోగినులకు మరింత భద్రత లభిస్తుంది. ఈ యాక్టు ప్రకారం డ్యూటీలో ఉన్న వైద్య, సిబ్బందిపై దాడులు జరిగితే ఫిర్యాదు చేసిన ఆరు గంటల వ్యవధిలో నిందితులపైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల డాక్టర్లపై ఎవరైనా దాడులు చేయాలంటే భయపడతారు. ప్రాణాలు కాపాడే వైద్య సిబ్బందికి ప్రతి ఒక్కరూ రక్షణగా నిలవాలి. కోల్‌కతా సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–పి.గౌరమ్మ, హెల్త్ సూపర్‌వైజర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బత్తలపల్లి



సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార సంఘటన తలుచుకుంటే చాలా భయమేస్తుంది. ఆస్పత్రుల్లో రాత్రి పూట కూడా వైద్య సేవలు అందించే మహిళా సిబ్బందికి ప్రభుత్వం సరైన రక్షణ కల్పించాలి. ఆస్పత్రి ఆవరణల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. పోలీస్ సిబ్బంది రాత్రి వేళల్లో గస్తీలు పెంచాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యుల రక్షణకు చట్టాలు ప్రవేశపెట్టాలి.

– ఎలిజబెత్ రాణి, స్టాఫ్‌నర్స్, పీహెచ్‌సీ, కనగానపల్లి

క్లుప్తంగా

ఉస్తి కాయలతో ఉపాధి



వేపలకుంట వద్ద ఉస్తికాయలు సేకరిస్తున్న గిరిజనులు

గాండ్లపెంట: మండలంలోని తుమ్మలబైలుతండా, బనాన్‌చెరువుపల్లి గ్రామాలకు చెందిన గిరిజనులు ఉస్తి కాయలను సేకరించి ఉపాధి పొందుతున్నారు. గ్రామాల్లో ఉపాధి పనులు ఇంకా ప్రారంభం కాలేదని దీంతో పొలం గట్ల వద్ద ఉన్న ఉస్తికాయలను సేకరించి వ్యాపారులకు అమ్ముకుంటున్నామని గరుగుతండాకు చెందిన ప్రసాద్‌నాయక్ తెలిపారు. ఉస్తికాయలను వ్యాపారులు శేరు కొలత రూ.15 తీసుకుంటున్నారని, కొంత మంది వ్యాపారులు తూకం కిలో రూ.30తో తీసుకుంటున్నట్లు చెప్పారు. పొలంగట్ల వద్ద కాయలు ఉంటే ఒక్కొక్కరు 10 కిలోల నుంచి 15 వరకు సేకరిస్తామని తెలిపాడు. వీటి కోసం స్వగ్రామం నుంచి 10 నుంచి 15 మైళ్ల దూరం కాలినడక భార్య పద్మాబాయి, తల్లి సాలెమ్మతో వచ్చానని చెప్పాడు. గ్రామంలో ఉపాధి పనులు కల్పించాలని సాలెమ్మ కోరింది. ఇదిలా ఉడగా ఉస్తికాయలను వ్యాపారులు సబ్బుల తయారీ కోసం చెన్నై తదితర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిసింది.

ఓటు హక్కు పొందండి

అమడగూరు: అమడగూరు పీఏసీఎస్‌లో ఆధారాలు ఇచ్చి ఓటు హక్కు పొందాలని సీఈఓ పద్మనాభరావు రైతులకు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, రేషన్‌కార్డు, పాన్‌కార్డు జిరాక్స్‌ప్రతులతో పాటుగా రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను సొసైటీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కేవైసీ చేయించుకోలేని పక్షంలో సింగిల్ విండో డైరెక్టర్ ఎన్నికల్లో ఓటు హక్కు ఉండదన్నారు. రైతులు విషయాన్ని గమనించి ఆధారాలు ఇవ్వాలని కోరారు.

పీజీ నీట్ ఫలితాల్లో కదిరి అమ్మాయి ప్రతిభ



సాయిరక్ష

కదిరి: ఇటీవల విడుదలైన నీట్ పీజీ ఫలితాల్లో కదిరికి చెందిన సీనియర్ న్యాయవాది శివప్రసాద్ కుమార్తె సాయిరక్ష జాతీయ స్థాయిలో 5,762వ ర్యాంకు సాధించింది. బెంగుళూరులోని రాజరాజేశ్వరి మెడికల్ కళాశాలలో మెడిసిన్ చేసి గోల్డ్ మెడల్ కూడా సాధించింది. తమ కుమార్తెకు నీట్ పీజీలో మంచి ర్యాంకు రావడం పట్ల తల్లిదండ్రులు సుధ, శివప్రసాద్ సంతోషం వ్యక్త పరిచారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించాలనేది తమ కుమార్తె లక్ష్యమని వారు పేర్కొన్నారు.

రేపు 'ప్రజా వేదిక'

అమడగూరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో రేపు మంగళవారం సామాజిక తనిఖీపై ప్రజావేదిక(బహిరంగ సభ) నిర్వహించనున్నట్లు ఏపీఓ అమరావతి ఓ ప్రకటనలో తెలియజేశారు. 2023–24కు సంబంధించి మండల వ్యాప్తంగా నిర్వహించిన ఉపాధ/ పనులపై పది రోజులుగా సోషల్ ఆడిట్ సిబ్బంది గ్రామాల్లో తనిఖీ చేసినట్లు తెలిపారు. ప్రజావేదికలో తనిఖీ వివరాలు వెల్లడిస్తారని, కూలీలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

సింగిల్ విండో అధ్యక్షుడికి పరామర్శ



జగదీశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మక్బూల్ అహ్మద్

ఎన్‌పి కుంట: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, సింగల్ విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి అనారోగ్యంతో అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి ఆదివారం జగదీశ్వర్‌రెడ్డిని కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉప సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు షామీర్ బాషా,అంజన్‌రెడ్డి, పి.పుల్లారెడ్డి, జేసీఎస్ మాజీ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, కో.ఆప్షన్ సభ్యుడు సుభహాన్, గ్రామ కన్వీనర్ అస్లాం, మండల మాజీ కన్వీనర్ బాబా ఫక్రుద్దీన్, నాయకులు రఘునాథ, పుల్లారెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శ్రీకృష్ణాష్టమికి పటిష్ట బందోబస్తు

పుట్టపర్తి టౌన్: ప్రశాంతి నిలయంలో సోమవారం జరిగే శ్రీకృష్ణాష్టమి వేడుకలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వైజాగ్ నుంచి 2500 మంది సత్యసాయి భక్తులతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా స్థానికులు, దుకాణదారులు సహకరించాలని కోరారు.

ఈ చెరువులు.. చిట్టడవులు!

- కంపచెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోయిన చెరువులు
- తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం
- చెరువుల కింద పడిపోయిన పంటల సాగు
- 'ఉపాధి' కింద చెరువులు మరమ్మతు చేయాలని కోరుతున్న రైతులు



కంపచెట్లు, పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తున్న తనకల్లు పెద్ద చెరువు



పిచ్చి మొక్కలతో నిండిపోయిన జమ్ము చెరువు

తనకల్లు: ఒకప్పుడు చెరువుల కింద పంటలతో గ్రామాలు కళకళలాడేవి. చెరువుల కింద ఆయకట్టు భూముల్లో ఏడాదికి రెండు, మూడు పంటలను పండించేవారు. చెరువులతో సాగు, తాగునీటికి ఇబ్బంది ఉండేది కాదు. అయితే నేడు పరిస్థితి మారింది. చెరువులన్నీ కంపచెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. వీటి వల్ల చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం ఎప్పటికప్పుడు తగ్గిపోతుండడంతో ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. పంట పొలాలన్నీ బీడు భూములుగా మారిపోయాయి. మండలంలో మొత్తం 60 చెరువులు ఉండగా, వీటి కింద 2,808 ఎకరాలు ఆయకట్టు ఉంది.

అన్ని చెరువులదీ అదే దుస్థితి..

మండలంలోనే పెద్ద చెరువు అయిన డీ. చెక్కవారిపల్లి చెరువు కింద 257 ఎకరాలు, తిమ్మనాయుని చెరువు కింద 184 ఎకరాలు, మల్లిరెడ్డిపల్లి 182 ఎకరాలు, సీఆర్ పల్లి 166, తనకల్లు చిన్న, పెద్ద చెరువుల కింద 100 ఎకరాల్లో పంటలను సాగు చేస్తారు. అయితే ప్రస్తుతం చెరువుల్లో కంప చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. దీంతో చెరువుల్లో చేరిన వర్షపునీరు ఎక్కువ కాలం నిల్వ ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. తూములు కనిపించడం లేదని, కాలువలు సైతం కుంచించుకుపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గట్లపై కంప చెట్లు పెరిగి కాలువలు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో పంటలను సాగు చేసే ధైర్యం చేయలేకపోతున్నామని, భూములను బీడుగా వదిలివేశామని రైతులు చెబుతున్నారు.

మత్స్యకారులకు తప్పని ఇక్కట్లు

చెరువుల ఆయకట్టు రైతులతో పాటు మత్స్యకారులు ఇబ్బందులు తప్పడం లేదు. దాదాపు వంద మత్స్యకారుల కుటుంబాలు ఈ చెరువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. పిచ్చి మొక్కలు, ముళ్ల పొదల వల్ల చేపలు సరిగా ఎదగకపోవడం వల్ల తాము నష్టపోతున్నామంటున్నారు. చెరువులలో ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించడంతో పాటు కాలువలు, తూములను మరమ్మతు చేయించాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేకపోయిందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఉపాధి హామీ కింద చెరువుల్లో కంప చెట్లు, పిచ్చి మొక్కలని తొలగించి, అన్ని రకాల మరమ్మతులు చేపట్టాలనికోరుతున్నారు.

పంటలు పెట్టలేకున్నాం



నాకు మల్లిరెడ్డిపల్లి చెరువు కింద ఎకరా పొలం ఉంది. గతంలో వరి, సజ్జ, మొక్కజొన్న సాగు చేసేవాన్ని. అయితే ఇప్పుడు చెరువు నిండా పిచ్చిమొక్కలే ఉన్నాయి. కాలువలు కూడా పూడిపోయాయి. నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండడం లేదు. దీంతో పంట సాగు చేయలేకున్నాం.

–నారాయణనాయక్, రైతు, పెద్దపల్లి

మరమ్మతులు చేపట్టాలి



చెరువులలోని కంప చెట్లు, ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను యుద్ధ ప్రాతిదికన తొలగించాలి. పూడికను తీయించాలి. తూములు, కాలువల మరమ్మతు పనులు చేపట్టాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– శివన్న, రైతు సంఘం మండల నాయకులు, తనకల్లు

ప్రతిపాదనలు పంపించాం



చెరువులలో కంప చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. తొలగించాలని రైతులు ఇప్పటికే ఫిర్యాదులు చేశారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం. చెరువులలో అన్ని రకాల మరమ్మతుల కోసం రూ. 6.34 కోట్లు అవసనరమని ప్రభుత్వానికి ప్రతిపాదలను ఇప్పటికే పంపించాం.

– బయప్ప, ఇరిగేషన్ ఏఈ, తనకల్లు

కంటి వైద్య శిబిరం



దాతలను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పుట్టపర్తి ఈఓఆర్‌డీ అశోక్‌కుమార్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 95 మందికి కంటిపరీక్షలను చేయగా 54 మంది శస్త్ర చికిత్సలకు ఎంపికైనట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు కార్యదర్శి రమేష్‌బాబు, కోశాధికారి నాగేంద్ర తెలిపారు. శిబిరం దాతలను సన్మానించారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు వెంకటస్వామి, పల్లెం వేణుగోపాల్, గూడూరు మోహన్‌దాస్, గోసే రాధాకృష్ణ, మెటికల కుళ్లాయప్ప, రాజగోపాల్, ఉట్టి శివప్రసాద్, శాగా సురేష్, ముక్తాపురం క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మధుకర్

పుట్టపర్తి టౌన్: సెప్టెంబర్ 1 నుంచి బీజేపీ దేశ వ్యాప్తంగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి మధుకర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం సభ్యత్వ నమోదుపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయిలో వివరించాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వం కోటాకు చేర్చే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ బాలకృష్ణయాదవ్, పార్థసారథి, జిల్లా అధ్యక్షులు శేఖర్, నాయకులు గుడిసె దేవానంద్, గంగాధర్, హరికృష్ణ, కత్తి రాజారెడ్డి, కొండమరాజు, జ్యోతిప్రసాద్, బాలగంగాధర్, సోకే రామాంజనేయులు, కళ్యాణ్, సత్యమయ్య, మేకలశ్రీనా, మిట్టా వంశీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం



నల్లమాడ మండలం కొత్తపల్లిలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

తాడిమర్రి: తమ జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని సత్యసాయి తాగునీటి సరఫరా కార్మిక సంఘం నేత ఎం.సతీష్ విమర్శించారు. స్థానిక మద్దులచెర్వు సమీపంలోని సత్యసాయి తాగునీటి సంపు వద్ద ఆదివారం జరిగిన సమ్మెలో ఆయన మాట్లాడారు. తమ సమస్యల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందని ఆరోపించారు. ఆరు నెలలుగా జీతాలు అందక పోవడంతో కుటుంబ పోషణ, పిల్లల చదువుల ఫీజులు తదితర ఆర్థిక సమస్యలతో సతమతం అవుతున్నామన్నారు. కే.పెద్దఓబిలేసు, పీ.తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సత్యసాయి నీటి పథకం కార్మికులు ఆదివారం కొత్తపల్లి తండా పంప్ హౌస్ వద్ద అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్మికులు మాట్లాడుతూ నాలుగో రోజు సమ్మెలో భాగంగా నిరసన తెలిపామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎం బాషా, రాంమోహన్, శ్రీనివాసులు, రామమోహన్‌రెడ్డి, ఓబిరెడ్డి, రామాంజి, షామీరు, కేశవ, శంకర, నాగభూషణం తదితర కార్మికులు పాల్గొన్నారు.

సైన్స్ ఫలాలు సామాన్యులకు అందాలి



మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్

పుట్టపర్తి అర్బన్: సైన్స్ ఫలాలను సామాన్యులకు అందేలా కృషి చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పేర్కొన్నారు. జగరాజుపల్లిలో ఆదివారం జేవీవీ మొదటి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు ఈటీ రామమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు మాట్లాడారు. శాస్త్ర, సాంకేతిక రంగాలు పూర్తిగా కార్పొరేట్ కబంధ హస్తాల్లో బందీ అయిపోవడంతో సమాజంలో ఎక్కువ మంది ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు. రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని నడుచుకుంటామని ప్రమాణం చేసిన వాళ్లే దానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. అన్ని రంగాల్లో అశాస్త్రీయ భావనలు రావడంతో ఛాందస వాదానికి బలం చేకూరుతోందన్నారు. ప్రజాస్వామ్య శక్తులు, ప్రశ్నించే వాళ్లపై దాడులు తీవ్రమయ్యాయన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసారెడ్డి, వెంకటరామిరెడ్డి, లక్ష్మీనారాయణ, గంగాధర్ నాయక్, రాజశేఖరరెడ్డి, వాసుదేవరెడ్డి, నబీ, చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, నారాయణస్వామి, రాజేంద్రప్రసాద్, లోకేష్, రమేష్, నరేంద్ర తదితరులు ఉన్నారు.

మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం



తాడిమర్రిలో మహిళలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం

తాడిమర్రి: రాష్ట్రంలోని మహిళలను లక్షాధికారులను చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఏపీఎం సాంబశివుడు పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక వెలుగు కార్యాలయంలో సర్పంచ్ బండారు బాలమ్మ, సీసీలు, బీజేపీ నాయకులు, టీడీపీ నాయకులతో లక్‌పతి దీదీలకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది రూ.1 లక్ష లోపు ఆదాయం ఉన్న మహిళలకు శ్రీనిధి, ఉన్నతి, బ్యాంక్‌ల ద్వారా రుణాలు అందిస్తామన్నారు.

ముదిగుబ్బ: క్రాంతి మండల సమాఖ్య కార్యాలయంలో ఆదివారం లక్ పతి దీదీ అనే కార్యక్రమాన్ని ఎంపీపీ ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా 998 సంఘాలకు రూ.10,41,87,417 నమూనా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సేవేనాయక్, చంద్రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: స్థానిక వెలుగుకార్యాలయంలో ఆదివారం ఏపీఎం శారద ఆధ్వర్యంలో లక్ పతి దీదీ కార్యక్రమం నిర్వహించారు. రూ.లక్షలోపు ఆదాయం ఉన్న మహిళా సంఘాల సభ్యులను గుర్తించి వారిని లక్షాధికారులను చేయడం కార్యక్రమం ఉద్దేశమని ఏపీఎం పేర్కొన్నారు. 82 మంది సభ్యులకు రూ.71.3 లక్షల చెక్కు అందజేశారు.

ఓడీచెరువు: ప్రతి మహిళను లక్ష్యాధికారిని చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీఎం రమణ తెలియజేశారు. పల్లవి మండల సమాఖ్య కార్యాలయంలో ఆదివారం లక్‌పత్ దీదీ కార్యక్రమం లైవ్ వర్చువల్ మీటింగ్ ఏర్పాటు చేశారు. పల్లవి మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, ఎంపీడీఓ కార్యలయ ఏఓ రెడ్డప్ప, సిసిలు పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల పునఃపరిశీలన



బత్తలపల్లిలో ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ నటరాజన్

బత్తలపల్లి: ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల పునఃపరిశీలన పక్కాగా చేపట్టాలని ధర్మవరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నటరాజన్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఆదివారం బత్తలపల్లి, అప్పరాచెరువు, సంగాల, దంపెట్ల రెవెన్యూ గ్రామాల్లో వారు వీఆర్‌ఓలతో కలిసి ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ చేసిన భూములను పరిశీలించారు. భూములకు సంబంధించిన రైతులు, కొనుగోలుదారులతో వివరాలను సేకరించారు. పొలం వద్దకు వెళ్లి పొలం పరిశీలించి సమస్యలు ఏవైనా ఉన్నాయా అంటూ ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు ప్రభుత్వానికి పలు ఫిర్యాదులు అందాయని, అందులో భాగంగానే పునఃపరిశీలన కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. శ్రీసత్యసాయి జిల్లాలో మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నారన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళా సంఘాల లీడర్లుకు ప్రశంసాపత్రాలు అందజేసిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రధానమంత్రి ధ్యేయమని ఏపీఎం అనసూయమ్మ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని రుద్రమదేవి మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాల లీడర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి చేపట్టిన లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏపీఎం మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆదాయం కోసం కాకుండా స్థిరమైన జీవనోపాధి వనరులను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం సంఘాలను సక్రమంగా నిర్వహించుకునే సంఘాలకు ప్రశంస పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీసీలు నరసింహమూర్తి, రమేష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత



ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: రోడ్డు భద్రత మన అందరి బాధ్యతని బత్తలపల్లి ఎస్‌ఐ పి.శ్రీనివాసులు అన్నారు. బత్తలపల్లి, లింగారెడ్డిపల్లి క్రాస్, ఈదుల ముష్టూరు క్రాస్ వద్ద ఆదివారం వాహన డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపైన అవగాహన కల్పించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వారికి జరిమానా విధించారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలని తెలిపారు. తల్లిదండ్రులు సైతం మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్‌స్టేషన్ వద్ద ఇసుక ట్రాక్టర్

బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ పట్టుకున్నారు. ఆదివారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను సంజీవపురం వద్ద పట్టుకొని, కేసు నమోదు చేయాలని ఎస్‌ఐ శ్రీనివాసులును ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తాడిమర్రి, బత్తలపల్లి మండలంలోని చిన్నచిగుళ్లరేవు, గరిశలపల్లి వద్ద చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక



రజక సంఘం నూతన కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శివానగర్‌లో రజక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. రజక సంఘం పట్టణాధ్యక్షుడిగా నరసింహులు, ఉపాధ్యక్షులుగా రామంజినేయులు, శివయ్య, ఆంజనేయులు, గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా బాబు, కోశాధికారిగా అంకులప్ప, సహాయ కార్యదర్శులుగా రమేష్, మునికుమార్, శ్రీరాములు, శ్రీనివాసులు, మహిళా విభాగం సభ్యులుగా వరలక్ష్మి, గంగమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రజకుల సమస్యలపై కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం ధోబీఘాట్‌ను శుభ్రం చేయించారు.

బాట మారెమ్మకు పూజలు

కనగానపల్లి: మండల కేంద్రానికి సమీపంలో ప్రధాన రహదారి పక్కన వెలసిన బాట మారెమ్మ దేవతకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు బోనాలు ఎత్తుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు కృష్ణాష్టమి వేడుకలు

బత్తలపల్లి: మండల కేంద్రంలో ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం నుంచి రెండు రోజులు పాటు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం స్థానిక తాడిపత్రి రోడ్డులోని బీసీ కాలనీలో ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణుని పూజ, భగవద్గీత పఠనంతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహం ఊరేగింపు, భగవద్గీత శ్లోకాల పఠనం ఉంటుందన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



నల్లచెరువు రోడ్డు మధ్యలో కల్వర్టుకు ఏర్పడిన గుంతలు

నల్లచెరువు: మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్ వద్ద ఓరువాయికి వెళ్లే రోడ్డు మధ్యలో నిర్మించిన కల్వర్టుపై ఏర్పాటు చేసిన సిమెంటు మూతలు దెబ్బతినడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుపై వర్షపు నీరు పారే సమయంలో గుంతలు కనపడక అటుగా వెళ్తున్న ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టును మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.